నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, బుధవారం 4 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

అభివృద్ధికి అడ్డుపడడం సిగ్గుచేటు

- బురద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన మున్సిపల్ పాలకవర్గం

పెబ్బేరులో బురద రోడ్డుపై కూర్చొని నిరసన తెలుపుతున్న చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

పెబ్బేరు, డిసెంబర్ 3 : పెబ్బేరు మున్సిపాలిటీలో మధ్యలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కొనసాగనీయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుగా ఉంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు ఆరోపించారు. మంగళవారం చిన్నపాటి వర్షానికి బురదమయమైన వనపర్తికి వెళ్లే రోడ్డుపై బైఠాయించి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సహకారంతో రోడ్డు వెడల్పు, డ్రైనేజీ పనుల కోసం నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వాటిని ఉద్దేశపూర్వకంగా నిలిపి వేసిందన్నారు. స్థానిక సుభాష్‌చౌరస్తా నుంచి అంబేద్కర్ నగర్ వరకు రోడ్డు వెడల్పులో భాగంగా అక్రమ నిర్మాణాలను తొలగించి డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టేందుకు రూ.15 కోట్లు మంజూరై పనులు కొనసాగుతుండగానే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. నాటి నుంచి ఇప్పటి వరకు పనులు మళ్లీ మొదలు కాలేదని, ఈ మేరకు తాము ఎమ్మెల్యే మేఘారెడ్డి, మంత్రి జూపల్లి, కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేదన్నారు. నిధులున్నప్పటికీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే పనులు సాగకుండా అడ్డుపడుతుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిన్న పాటి వర్షానికే రోడ్డు బురద గుంటగా మారుతోందని, నిత్యం వందలకొద్దీ వాహనాలు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. రోడ్డు పనులు చేపట్టి అవస్థలు తీర్చాలని చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, గోపిబాబు, రామకృష్ణ, పార్వతి, సుమతి, పద్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ రమేశ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు చేదు అనుభవం

- పేరుకే ఫ్రీ బస్సు..
- మహిళలను చిన్నచూపు చూస్తున్నారు..
- కాగితాల్లో లెక్కలు కాదు.. పథకాలు అమలు చేయండి
- మక్తల్ ఎమ్మెల్యేను నిలదీసిన మహిళలు

ఎమ్మెల్యేను నిలదీస్తున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

మక్తల్, డిసెంబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన ఫ్రీ బస్సు పథకం చెప్పుకోవడానికే బాగుందని, అందులో ప్రయాణిస్తున్న మహిళలను ఆర్టీసీ వారు చిన్న చూపు చూస్తుండడంతోపాటు హేళన చేసి మాట్లాడుతున్నారని, మహిళలు కనిపిస్తే బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారని ఫ్రీ బస్సు ఏ ఉద్దేశంతో ఎవరి కోసం పెట్టారని మహిళా మణుల నుంచి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేదు అనుభవం ఎదురైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో అర్బన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సంఘాల సభ్యులు పెద్దసంఖ్యలో హాజరైన నేపథ్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరం చేపట్టిన కార్యక్రమాలు, చేసిన అభివృద్ధి పనుల గురించి మహిళా సంఘాల సభ్యులకు తెలియపరచాలని ఎంతో ఆశతో ఎమ్మెల్యే తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రసంగం ప్రారంభించిన మొదట్లోనే మక్తల్ మున్సిపాలిటీలో మహిళల కు ప్రభుత్వం నుంచి సిలిండర్లను అందించామంటూ ప్రసంగం ప్రారంభించి, ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారంగా రాష్ట్రంలో ఫ్రీ బస్సు ప్రారంభించి మహిళలకు జీరో టికెట్ అందించి వారి చార్జీలను ప్రభుత్వం భరిస్తుందని మాట్లాడుతున్న క్రమంలోనే మహిళలు ఒక్కసారిగా అడ్డుకున్నారు. ఫ్రీ బస్సు ఏ ఉద్దేశంతో పెట్టారో కానీ ఫ్రీ బస్సు ఎక్కాలంటే చాలా ఇబ్బందులు ఎదురవడంతో పాటు , మహిళలు అయినా మేము అవ హేళనకు గురికావాల్సి వస్తుందని, ఆర్టీసీ వాళ్లు బస్సులో ఎక్కేటప్పుడు మహిళలను అని చూడకుండగా కించపరుస్తూ మాట్లాడుతున్నారని, మహిళలు కనిపిస్తే బస్సులు ఆపకుండా వెళ్లిపోతున్నారని వాపోయారు. పేరుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సు పెట్టి మహిళా మణులను అవ హేళన చేసేందుకు సిద్ధమైందంటూ ఎమ్మెల్యేకు బదులిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే 18 ఏండ్లు నిండిన యువతీతోపాటు మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు రూ.2500 చెల్లిస్తామని చెప్పి ఏడాది గడుస్తున్నా కనీసం రూ.250 కూడా ఇవ్వలేదన్నారు. సిలిండర్‌కు సంబంధించిన డబ్బులు కూడా చెల్లించడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని అమలు చేయడం లేదని ఎమ్మెల్యేను నిలదీశారు. ఒక్కసారిగా మహిళలందరూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండగా ప్రజాపాలనపై విజయోత్సవాలు నిర్వహించుకుంటున్న సభలో ఇవ్వని పథకాలను ఇచ్చినట్టుగా పేపర్లలో లెక్కలు చూపించడం ఏంటని ప్రశ్నించడంతో మహిళా కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది వారిని అడ్డుకోవడంతో ఎమ్మెల్యే చేసేది లేక తన ప్రసంగాని ఆపి మహిళా సంఘాలకు మంజూరైన లింకేజీ రుణాలకు సంబంధించిన రూ.3.83 కోట్ల చెక్కులను అందించి వెళ్లిపోయారు. అయితే తమ సమస్యలను ఎమ్మెల్యేకు చెప్పుకుందామని వస్తే పోలీసులు చెప్పుకోవడానికి అవకాశం లేకుండా చేశారని కొంతమంది మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

పేరుకు మాత్రమే ఫ్రీ బస్సు..

కాంగ్రెస్ పార్టీ మహిళా మణులకు ఫ్రీ బస్సు అందిస్తున్నామని చెబుతున్నారు.. కానీ ప్రయాణం చేసేందుకు సరిపడా బస్సులు లేక పోవడంతో మహిళలు ఎన్నో అవమానాలతో బస్సుల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి తలెత్తింది. అవసర నిమిత్తం వెళ్లాలనుకున్నా.. ప్రస్తుతం బస్సులో వెళ్లాలంటే అవమానాలతోపాటు ఎన్నో మాటలు అనిపించుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం కేవలం మహిళలను కించపర్చేందుకే ఫ్రీ బస్సు పథకం పెట్టినట్లు అనిస్తుంది. – సత్తెమ్మ, మక్తల్

ప్రభుత్వం నుంచి ఏ పథకాలు రాలేదు..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాదైనప్పటికీ ప్రభుత్వం చెప్పిన ఒక్కటి ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్క పథకం మాకు రాలేదు. ప్రస్తుతం ప్రజాపాలన విజయవత్సవాలు జరుపుకొంటున్న నాయకులు అన్ని హామీలు అమలు చేసిన తర్వాతే జరుకుంటే బాగుంటుంది. అమలు కానీ వాటిని కూడా కాగితాల్లో చూపించి అన్ని చేసినట్లుగా చెబితే ఎవరూ నమ్మరు. ఒక వేళ ఏమి చేయకుండా చేసినామని చెప్పుకుంటే ఈ ప్రభుత్వాన్ని తరిమికొట్టే రోజులు వస్తాయి. – సరస్వతి ,మక్తల్

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

దేవరకద్ర, డిసెంబర్ 3: గురుకుల పాఠశాలలు, హాస్టళ్లు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్వీ పాలమూరు యూనివర్సిటీ కన్వీనర్ గడ్డం భరత్ బాబు అన్నారు. అన్నింటా మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల తోపాటు బీసీ గురుకుల పాఠశాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థులకు బెడ్ షీట్లు, షూలు, కాస్మోటిక్ చార్జీలను ఇప్పటి వరకు చెల్లించలేదని విద్యార్థులు తెలిపారన్నారు. అదేవిధంగా బోరు చెడిపోవడంతో స్నానం చేయడానికి కూడా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అయితే చౌదర్‌పల్లి సమీపంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలోకి వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదని, అన్ని వసతులు సక్రమంగా ఉంటే పాఠశాలలోకి ఎందుకు అనుమతించడం లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు ఆంజనేయులు, నరేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్వీ పీయూ కన్వీనర్ భరత్‌బాబు

- 4వ విడుత మాఫీ ప్రక్రియ నత్తనడక
- ఇంకా బ్యాంకులకు చేరని నగదు
- అర్హులైన రైతులకు కష్టాలు
- మాఫీలో వీడని సందిగ్ధం
- వనపర్తి జిల్లాలో ఇంకా 10 వేల మందికి..

సా..గుతున్న రుణమాఫీ

వనపర్తి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వం రైతులకు రూ. రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేశామని ఇటీవలే మళ్లీ ప్రకటించింది. అయితే, జిల్లాలో వివిధ కారణాలతో అర్హులైన రైతులకు ప్రారంభంలో రుణమాఫీ కాలేదు. అర్హత ఉండి మాఫీకాని రైతులు పలు చోట్ల ఆందోళనలు చేయడంతో స్పందించిన ప్రభుత్వం రైతు కుటుంబాల నిర్ధారణకు వ్యవసాయశాఖ ద్వారా శ్రీకారం చుట్టి లోపాల సవరణకు కార్యాచరణ తీసుకున్నది. ఇందులో భాగంగా ఆగస్టు 27నుంచి సెప్టెంబర్ 4 వరకు గ్రామ స్థాయిలో సభలు నిర్వహణ, అనంతరం వ్యవసాయ కార్యాలయాలు, రైతు వేదికల్లో నిర్ధారణ ప్రక్రియలను చేపట్టింది. ఇప్పుడప్పుడంటూ 4వ విడుత రుణమాఫీ అని ఇటీవల నాలుగు రోజుల కిందట సీఎం రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ సభలో ప్రకటించి వెళ్లినా రైతుల ఖాతాలో డబ్బులు జమకాని పరిస్థితి ఉంది. వెరిసి జిల్లా వ్యాప్తంగా చేపట్టిన నిర్ధారణలో సగం మంది రైతులకు కూడా నాలుగో విడుతలో రుణమాఫీ రాక పోవడం మరింత గందరగోళానికి దారి తీస్తున్నది.

4వ విడుతలో రూ.48 కోట్లు..

జిల్లా పరిధిలోని 14 మండలాల్లో 4వ విడుత లో దాదాపు రూ.48 కోట్ల 79 లక్షలు విడుదల చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించి 5,366మంది రైతులకు రుణమాఫీ కింద ఈ డబ్బులు జమ చేయనున్నారు. అయితే.. గతంలో వ్యవసాయ శాఖ ద్వారా సేకరించిన వాటిలో సగం మందికి కూడా మాఫీ కాలేదని తెలుస్తున్నది. ఇంకా చాలా మంది రైతులు రూ. 2లక్షలు లోపు రుణం ఉన్న వారు వివిధ కారణాలతో మిగిలి పోయినట్లుగా చెబుతున్నారు. ఇక రుణమాఫీ నూటికి నూరుశాతం క్లియర్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనలు చేసిన క్రమంలో మిగిలిన వారి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలా ఉంటే.. జిల్లాలో తొలివిడుతలో 27వేల 66మందికి రూ. 145.55 కోట్లు, రెండో విడుతలో 16,527మందికి రూ.154.58 కోట్లు, మూడో విడుతలో రూ. 10,47 మందికి రూ.126.62 కోట్లు మాఫీ కింద వచ్చింది. ఇలా మొత్తం జిల్లాలో 53,640 మంది రైతులకు రూ.426.76 కోట్లు రుణమాఫీ అయ్యింది.

10 వేల రైతులకు అందని మాఫీ..

జిల్లాలో ఇంకా దాదాపు 10 వేల మంది అర్హులైన రైతులకు రుణమాఫీ అందలేదని అంచనా. గతంలో వ్యవసాయశాఖలో నిర్ధారణ ప్రక్రియ చేసుకున్న వాటిలోనూ సగం మందికి నాలుగో విడుత మాఫీలో లిస్టులో పేర్లు రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించినా అమలు కాలేదు. జిల్లాలో వ్యవసాయశాఖ ద్వారానే 9,127 మంది రైతులకు సమస్య ఉన్నట్లుగా గతంలో గుర్తించారు. కనీసం వారికి కూడా 4 విడుతలో మాఫీ కాలేదు. అయితే రూ.రెండు లక్షలకు పైబడి రుణం ఉన్న వారి సంఖ్య జిల్లాలో మరింత భారీగానే ఉండే పరిస్థితి ఉంది. వారందరికీ రుణమాఫీ అందని ద్రాక్షగానే మిగులుతుందని భావిస్తున్నారు.

బ్యాంకులకు చేరని డబ్బులు..

నాలుగో విడుత రుణమాఫీ ప్రకటించి నాలుగు రోజులు గడిచినప్పటికీ ఇంకా అనేక బ్యాంకుల్లో నిధులు జమ కాలేదు. అన్ని బ్యాంకులకు మాఫీ రైతుల లిస్టులు చేరుకున్నప్పటికీ డబ్బుల జమమాత్రం కాలేదు. వీటిలో కొన్ని బ్యాంకులకు మాత్రం కొన్ని అకౌంట్లకు మాత్రమే డబ్బులు జమ అయినట్లు తెలుస్తుంది. మరికొన్ని బ్యాంకుల్లో ఒక్క అకౌంట్‌కు కూడా డబ్బులు జమ కానీ పరిస్థితి ఉంది. రైతులు మాత్రం వ్యవసాయ అధికారులు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నాలుగో విడుత మాఫీపై ఏ కార్యాలయానికి వెళ్లినా సరైన సమాధానం రావడం లేదని రైతులు విమర్శిస్తున్నారు.

స్పందించని డీఏవో..

4వ విడుత రుణమాఫీకి సంబంధించి ప్రాథమిక సమాచారం కోసం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందనాయక్‌ను సంప్రదించే ప్రయత్నం చేసినా స్పందించ లేదు. మంగళవారం కార్యాయానికి వెళితే అక్కడ అందుబాటులో లేరు. ఫోన్‌లో తెలుసుకొనే ప్రయత్నం చేసినా రెస్పాండ్ అవ్వలేదు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ఫోన్ చేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. జిల్లా అధికారులే ఇలా ఫోన్‌లకు కనీస రెస్పాన్స్ ఇవ్వని క్రమంలో కింది స్థాయి అధికారులు, సిబ్బంది పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పకుండానే అర్థమవుతుంది.

రుణమాఫీ లిస్టులో నా పేరు లేదు..

వ్యవసాయఅధికారులు అన్ని రాసుకున్నారు. ఫొటోలు తీసుకున్నారు. అయినా నాలుగో విడుత మాఫీ లిస్టులో మాపేరు లేదు. ఒక కుటుంబానికి రూ.రెండు లక్షలు మాఫీ చేస్తామన్నారు. నా పేరుతో రూ.లక్షా 50వేల రుణం ఉంది. నాకు ఎందుకు మాఫీ కాలేదు. అధికారులను అడిగితే లిస్టులో పేరు లేదని చెబుతున్నారు. ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేదొకటి అన్నట్లుగాఉంది.

– వెంకటేశ్, రైతు, శ్రీకృష్ణనగర్, అమరచింత

కొర్రీలు పెట్టి లేదంటుండ్రు..

బ్యాంకులో అడిగితే నాలుగో విడుత రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదంటున్నారు. నాకు రూ. లక్షా 50 వేల అప్పు యూనియన్ బ్యాంకులో ఉంది. మా అమ్మకు నాకు ఒకే రేషన్ కార్డు ఉంది. ఒకే రేషన్ కార్డు ఉన్నవారికి మాఫీ కాదా.. కావాలనే ఇలా లింకు పెట్టి మమ్మల్ని బాధ పెడుతున్నారు. ఇంటికి రూ.రెండు లక్షలు చేస్తామన్నారు. అలాగే చేయండి. కానీ.. మాలాంటి కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారు. మాఫీ వస్తదంటే ఎంతో ఆశపడ్డం. మా అశలు ఆవిరి అవుతున్నయి.

–ఎం శ్రీనివాసులు, రైతు, పామిరెడ్డిపల్లి, అమరచింత మండలం

రాగానే జమ చేస్తాం..

నాలుగో విడుత రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి డబ్బులు జమ అయిన వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేస్తాం. ఇప్పటి వరకు రాలేదు. బ్యాంకు వారీగా 4వేల 29 మందికి రూ.4కోట్ల 85 లక్షలు మాఫీ అయినట్లు లిస్టు వచ్చింది. కానీ ప్రభుత్వం నుంచి బ్యాంకులో జమ కాలేదు. త్వరలో వచ్చే అవకాశముంది. రైతులు డబ్బులు పడే వరకు ఆగాలి.

– శివశంకర్, బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్, అమరచింత

మాఫీ మాకేదీ?

- సీఎం ప్రకటనపై ఆగ్రహం
- మాఫీ పూర్తయిందనడంతో రైతుల ఆందోళన
- ప్రస్తుతం 8,262 మందికే..
- జోగుళాంబ గద్వాల జిల్లాలో మళ్లా దరఖాస్తు చేసుకున్న 14 వేల కుటుంబాలు

గద్వాల, డిసెంబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం ఓవైపు రూ.2 లక్షల రుణమాఫీ చేశామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం చాలా మందికి అమలు కాలేదు. అర్హత ఉన్నా.. మాకేది అంటూ పలు చోట్ల కర్షకులు సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన రైతు పండుగ కార్యక్రమంలో రైతులతో చప్పట్లు కొట్టించుకొని రుణమాఫీ చేశామని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం మొండిచేయి చూపిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గద్వాల జిల్లాలో..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 1.40 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో లక్ష నుంచి రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్నట్లు అధికారుల అంచనా. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేయగా రూ.2 లక్షల రుణాలు తీసుకున్న చాలా మందికి మాఫీ కాలేదు. అయితే కాని రైతుల వివరాలను సేకరించారు. రైతులు కూడా వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 14 వేల మంది రైతు కుటుంబాలు తమకు మాఫీ వర్తించలేదని మళ్లా దరఖాస్తు చేశారు. వాస్తవంగా జిల్లాలో కేవలం 8,262 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో వచ్చింది. లిస్టులో తమ పేర్లు చెక్ చేసుకున్న రైతులు అర్హత ఉన్నా మాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంతోఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ తర్వాత గద్దెనెక్కి రుణమాఫీ చేయకుండా మొండిచేయి చూపిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటు రుణమాఫీ గాక.. అటు రైతు భరోసా ఇవ్వకపోవడంతో రైతులు మరోసారి పెట్టుబడుల కోసం ఆసాముల వద్ద చేయి చాచాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఎలాంటి షరతులు లేకుండా రూ2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన రేవంత్ సర్కారు ఇప్పుడు కొర్రీలు పెట్టడం ఏమిటని అన్నదాతలు నిలదీస్తున్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే సర్కారు తమ నడ్డి విరిచిందని ఆక్రోశం వెల్లగక్కుతున్నారు. ఏది ఏమైనా రుణమాఫీ విషయంలో ఎటువంటి షరతులు లేకుండా కేసీఆర్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని.. ప్రస్తుతం రుణమాఫీ కాని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు..

గట్టులోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.1,51,500 పంట రుణం తీసుకున్నాను. ప్రతి ఏడాది రెగ్యులర్‌గా రెన్యూవల్ చేస్తూ వచ్చాను. గతేడాది ఆగస్టు 3వ తేదీనా రెన్యూవల్ చేశాను. నాకు రుణమాఫీ కాక పోవడంతో వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు మీ రుణమాఫీ ప్రాసెస్‌లో ఉందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే జాబితాలో లేదన్నారు. నేను రెగ్యూలర్‌గా రెన్యూవల్ చేసినా రుణమాఫీ కాలే. రెన్యూవల్ చేయకుండా ఉంటే బాగుండు అనిపిస్తుంది. ప్రభుత్వం చేస్తున్న మాఫీ అంతా గందరగోళంగా ఉంది. అధికారంలోకి రావడానికి ప్రభుత్వం చెప్పిందొకటి.. ప్రస్తుతం చేస్తున్నది మరోటి..

– రాఘవేంద్రరావు , రైతు, గట్టు

కుటుంబంలో ఒక్కరికీ కాలే..

ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో మా కుటుంబంలో ఒక్కరికి కూడా రుణమాఫీ కాలే. అయిజలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో నా పేరుపై రూ.1.60 లక్షలు, నా భర్త తిరుమలయ్య పేరుపై అదే బ్యాంకులో రూ.1.60 లక్షలు, నా కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి పేర రూ.60 వేల రుణం తీసుకున్నాం. ముగ్గురిది ఒకే ఫ్యామిలీ.. ఒకే రేషన్ కార్డు.. ఉన్నప్పటికీ ఎవరికీ రుణమాఫీ కాలేదు. దీంతో వ్యవసాయఅధికారులకు దరఖాస్తు చేసుకున్నాం. మొన్న ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో ఎవరి పైనా ఒకరికి మాఫీ అవుతుందనుకున్నాం.. కానీ ఎవరికీ కాలేదు. ఎన్నికల సమయంలో షరతులు లేకుండా ఇస్తామని.. ఇప్పుడేమో కొర్రీల పేరుతో మాఫీ చేయడం లేదు.

– రామలక్ష్మి, మహిళా రైతు, అయిజ

రూ.2లక్షలకుపైగా ఉన్నా మాఫీ లేదాయే..

మాకు 13 ఎకరాల పొలం ఉంది. ఎస్‌బీఐలో నా పేరుపై.. నా భార్య పేరుపై రూ.2.80 లక్షల రుణం తీసుకున్నాం. అయితే రూ.2 లక్షలకుపైగా ఉన్నా రూ.80 వేలు బ్యాంకులో చెల్లించాం.. రెన్యూవల్ రెగ్యులర్‌గా వేస్తున్నాను. మాఫీ కాకపోవడంతో మళ్లా వ్యవసాయశాఖ అధికారులకు దరఖాస్తులు అందించాం. అయినా రుణమాఫీ కాలే. దీంతో పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేసి కాని వారికి తిరిగి రుణమాఫీ చేసి ఆదుకోవాలి. అయినా ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో మా పేర్లు లేవు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే మాట మార్చింది. – వెంకట్రామిరెడ్డి, రైతు, జిల్లెదుదిన్నె

భూనిర్వాసితుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.25లక్షలు ఇవ్వాలి

- 18 ఏండ్లు నిండిన వారందరినీ ఒక కుటుంబంగా పరిగణించాలి
- ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌కు భూనిర్వాసితుల వినతి

జడ్చర్ల, డిసెంబర్ 3 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్‌లో వల్లూరు, ఉదండాపూర్, గ్రామాలతో పాటు తండా ఇండ్లు ముంపునకు గురవుతున్నాయి. ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన రోజు విలువ కంటే ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం ఇంటి నిర్మాణాలకు, స్థలాలకు పరిహారం చెల్లించాలని ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలు ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి చేశారు. మంగళవారం జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులతో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలతో వేరువేరుగా అభిప్రాయాలను సేకరించారు. ప్రాజెక్టు కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న పరిహారం కన్నా ప్రస్తుతం 2024మార్కెట్ విలువ ప్రకారం ఇంటికి, ఖాళీ స్థలాలకు రేట్లు పెంచి పరిహారం ఇవ్వాలని, 2024 వరకు పరిగణించి 2024 వరకు 18ఏండ్లు నిండిన వారిని కూడా ఒక కుటుంబంగా పరిగణించి పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన గ్రామాల భూనిర్వాసితుల నుంచి వారి సమస్యలను తెలుసుకోవడానికి వచ్చిన ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌కు తమ అభిప్రాయాలు తెలుపాలని వచ్చిన వారందరిని వారిదగ్గరకు వెళ్లకుండా కొందరిని మాత్రమే పంపించడంతో నిర్వాసితులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

అందరినీ కాకుండా గ్రామానికి కొంతమందిని మాత్రమే వారిదగ్గరకు అనుమతించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జిల్లా ఎస్పీ జానకితో పాటు ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్, తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.